భక్తిశ్రద్ధలతో కాత్యాయని వ్రతం



వ్రతానికి హాజరైన భక్తులు



విశేషాలంకారంలో అమ్మవారు

నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరి దేవస్థాన ప్రాంగణంలో గల అనివెట్టి మండపంలో కాత్యాయని వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో మంగళవారం నిర్వహించారు. విశేష పుష్పాలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. పూజలను ఆలయ ప్రధానార్చకుడు సూరావఝుల రఘురామ్మూర్తి ఆధ్వర్యంలో జరిపారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఈఓ కోవూరు జనార్దన్ రెడ్డి పర్యవేక్షించారు.

• దేవస్థానంలో ఈ నెల 22 నుంచి అక్టోబర్ రెండు వరకు నిర్వహించనున్న శరన్నవరాత్రి మహోత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డికి అందజేశామని ఈఓ జనార్దన్‌రెడ్డి తెలిపారు. దేవస్థాన ప్రధానార్చకుడు, అర్చకులు, వేదపండితులతో కలిసి వెళ్లి ఆహ్వానించామని వివరించారు.

క్లుప్తంగా

18 నుంచి స్కూల్ గేమ్స్ ఎంపికలు

నెల్లూరు(టౌన్): నెల్లూరు అర్బన్ మండలానికి సంబంధించిన స్కూల్ గేమ్స్ ఎంపికలను ఈ నెల 18 నుంచి 20 వరకు నిర్వహించనున్నామని ఎంఈఓ తిరుపాల్, ఎస్జీఎఫ్ కోఆర్డినేటర్ హరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ – 14 విభాగంలో 2012, జనవరి ఒకటి తర్వాత.. అండర్ – 17 విభాగంలో 2009, జనవరి ఒకటి తర్వాత జన్మించిన విద్యార్థులు అర్హులని చెప్పారు. ఎంపికలకు హాజరయ్యే విద్యార్థులు తమ స్టడీ సర్టిఫికెట్, ఆధార్‌కార్డులను తీసుకురావాలని కోరారు. స్టోన్‌హౌస్‌పేటలోని ఆరెస్సార్ మున్సిపల్ స్కూల్లో కబడ్డీ, వాలీబాల్, చెస్‌ను 18న.. ఏసీనగర్‌లోని మున్సిపల్ స్కూల్లో ఖోఖో, యోగాను 19న.. ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో అథ్లెటిక్స్ ఎంపికలను 20న నిర్వహించనున్నామని వివరించారు. వివరాలకు 81212 30949 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

విద్యార్థికి చేయూత



నెల్లూరు(బృందావనం): ప్రతిభ గల పేద విద్యార్థులకు తమ వంతు తోడ్పాటును అందించనున్నామని ప్యూర్ స్మైల్స్ సేవా సంస్థ అధ్యక్షురాలు పర్వీన్ పేర్కొన్నారు. నగరంలోని కొత్తూరులో గల బెతేలు వేళాంగణిమాత ఇంగ్లిష్ మీడియం స్కూల్లో పదో తరగతి విద్యార్థి ఏడుకొండలు చదువు కోసం రూ.పది వేల ఫీజును ప్రిన్సిపల్‌కు మంగళవారం అందజేశారు. అనంతరం 60 మంది విద్యార్థులకు అన్నదానం చేశారు. సంస్థ సభ్యులు నళిని, భారతి తదితరులు పాల్గొన్నారు.

బాక్సింగ్, జూడో పోటీలకు గురుకుల విద్యార్థులు



ఇందుకూరుపేట: రాష్ట్ర స్థాయిలో నిర్వహించనున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో బాక్సింగ్, జూడో జిల్లా జట్లకు ఇందుకూరుపేటలోని రాష్ట్ర గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు జనార్దన్‌రావు తెలిపారు. ఈ క్రమంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో వీరిని అభినందించారు. అండర్ – 14 బాక్సింగ్‌లో మానికల సుశాంత్, చందు, రోహిత్, అండర్ – 17లో హర్షవర్ధన్, భరత్.. జూడో అండర్ – 14కు అంజనాద్రి, సుశాంత్ ఎంపికయ్యారని పేర్కొన్నారు. వ్యాయామ ఉపాధ్యాయుడు వెంకటకృష్ణకు అభినందనలను తెలియజేశారు.

మండల సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న పెంచలశ్యామ్

ఇందుకూరుపేట: వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని అధికారులు ముందుస్తు చర్యలు చేపట్టాలని డిప్యూటీ ఎంపీడీఓ పెంచలశ్యామ్ పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ గంధళ్ల శంకరయ్య ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. తమ పరిధిలో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు.. ప్రస్తుత స్థితిని అధికారులు వివరించారు. డీటీ గోపీకృష్ణ, మండల ఉపాధ్యక్షులు లావణ్య, మమత తదితరులు పాల్గొన్నారు.

పెన్నా పరీవాహక ప్రాంతాల్లో పరిశీలన



కోవూరు: సోమశిల జలాశయం నుంచి 35 వేల క్యూసెక్కులను విడుదల చేయడంతో పెన్నా పరీవాహక ప్రాంతాలను తహసీల్దార్ సుబ్బయ్య మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పరిస్థితిని రెవెన్యూ, పోలీస్ శాఖ, విపత్తు నిర్వహణ సిబ్బంది నిరంతరం పర్యవేక్షిస్తున్నారని వివరించారు. అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించేలా ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు.

సహకార సంఘాల సభ్యులకు శిక్షణ



రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లను అందజేస్తున్న గుర్రప్ప

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లాలోని రైతుల సంక్షేమం, అభివృద్ధి కోసం సహకార సంఘాలు పనిచేయాలని డీసీఓ గుర్రప్ప పేర్కొన్నారు. కలిగిరి మండల వ్యవసాయ అనుబంధ మహిళా రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘాల సభ్యులకు శిక్షణ కార్యక్రమాన్ని నగరంలోని డీసీఓ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. సంఘ నిర్వహణ, సభ్యత్వ నమోదు, సంఘ ఆశయాలపై అవగాహన కల్పించిన అనంతరం ఆయన మాట్లాడారు. సహకార సంఘాల ద్వారా ఎరువులు, విత్తనాలను సరఫరా చేయాలని పేర్కొన్నారు. నానో యూరియా, బయో ఫర్టిలైజర్స్ వినియోగాన్ని పెంచేలా అవగాహన కల్పించాలని కోరారు. అనంతరం రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు, బైలా పుస్తకాలను అందజేశారు. డీసీఓ కార్యాలయ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఉమామహేశ్వరి, సీనియర్ ఇన్‌స్పెక్టర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్రమం తప్పకుండా పూడికతీత పనులు



కాలువను పరిశీలిస్తున్న నందన్

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో గల కాలువల్లో పూడికతీత, సిల్ట్ తొలగింపు పనులను క్రమం తప్పకుండా చేపట్టాలని కమిషనర్ నందన్ ఆదేశించారు. నగరంలోని 8, 9, 14, 16వ డివిజన్లలో గల పలు ప్రాంతాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. చిల్డ్రన్స్ పార్క్ ప్రాంతంలో ఫుట్‌పాత్‌లను ఆక్రమించి ఏర్పాటు చేసిన దుకాణాలు, నిర్మాణాలను తొలగించాలని ఆదేశించారు. గిడ్డంగి వీధిలో కాలువలను ఆక్రమించి చేపట్టిన కట్టడాలను టౌన్ ప్లానింగ్ సిబ్బంది తొలగించారు. అన్ని పార్కుల్లో ఆట వస్తువులు, క్రీడా పరికరాలు, పచ్చదనం తదితర మౌలిక వసతులను కల్పించాలని సూచించారు. మైపాడు గేట్ సమీపంలో చేపట్టిన స్మార్ట్ స్ట్రీట్ బజార్ పనులను తనిఖీ చేశారు. కార్పొరేటర్లు కర్తం ప్రతాప్ రెడ్డి, వేనాటి శ్రీకాంత్‌రెడ్డి, ఇంజినీరింగ్ విభాగ ఎస్‌ఈ రామ్మోహన్‌రావు, ఈఈ రహంతుజానీ తదితరులు పాల్గొన్నారు.

• వచ్చే నెల రెండు వరకు స్వచ్ఛత హీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించనున్న నేపథ్యంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశాన్ని కమిషనర్ నందన్ నిర్వహించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వీఆర్సీ కూడలి నుంచి గాంధీబొమ్మ వరకు ర్యాలీని బుధవారం ఉదయం ఎనిమిది గంటలకు నిర్వహించనున్నామని పేర్కొన్నారు. డీఎంహెచ్‌ఓ సుజాత తదితరులు పాల్గొన్నారు.

• ప్రధానమంత్రి ఆవాస్ యోజన – అర్బన్ 2.0లో భాగంగా నగరంలో చేపట్టనున్న కార్యక్రమ వివరాలకు సంబంధించిన కరపత్రాలను కమిషనర్ నందన్ ఆవిష్కరించారు. నగరపాలక సంస్థ డిప్యూటీ డైరెక్టర్ మాధురి, సిటీ ప్లానర్ హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

• నిర్దేశించిన లక్ష్యాలను సచివాలయంలోని కార్యదర్శుల సమన్వయంతో సాధించాలని కమిషనర్ నందన్ సూచించారు. రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశాన్ని కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో నిర్వహించారు. డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, టీపీఆర్వో వాసుబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పౌష్టికాహార కిట్ల అందజేత



నెల్లూరు(బృందావనం): వనంతోపు సమీపంలోని అబైడింగ్ హోప్ ట్రస్ట్‌లో డైరెక్టర్ డాక్టర్ టైటస్ నిర్మల్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలను అడ్వాన్స్‌డ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కౌన్సెలింగ్ అండ్ హ్యూమన్ రిలేషన్స్ సంస్థకు చెందిన అబ్దుల్ కలామ్. డాక్టర్ డొమినిక్ ఫెర్నాండెజ్ కార్ల్ మంగళవారం పరిశీలించారు. అనంతరం 300 మంది విద్యార్థులకు స్టేషనరీ, పౌష్టికాహార కిట్లను సింగపూర్ యాంటీ నార్కొటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అందజేశారు. జయప్రకాష్, క్రాంతి, బాబు, రూత్, శశి, రామ, జయ తదితరులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పు చెంపపెట్టు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): వక్ఫ్ సవరణ బిల్లుపై సుప్రీం కోర్టు తీర్పు కేంద్ర ప్రభుత్వానికి చెంపపెట్టని ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షుడు అజీజ్ అహ్మద్, సీపీఐ నగర సహాయక కార్యదర్శి సిరాజ్ పేర్కొన్నారు. ఈ మేరకు నగరంలోని ఆజాద్ సెంటర్‌లో విలేకరుల సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. వెంకటేశ్వర్లు, మున్వర్, బాబు తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (టౌన్): వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ బాలుర ఐటీఐలో మిగిలిన సీట్ల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపల్ శ్రీధర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ప్రభుత్వ ఐటీఐల్లో ప్రవేశానికి 29న, ప్రైవేట్ ఐటీఐల్లో చేరేందుకు కౌన్సెలింగ్‌ను 30న నిర్వహించనున్నామని పేర్కొన్నారు.

'డీకేడబ్ల్యూ'లో రక్తదానం



నెల్లూరు (టౌన్): నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో రక్తదాన శిబిరాన్ని యూత్ రెడ్‌క్రాస్ కమిటీ, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 40 మంది రక్తదానం చేశారు. ప్రిన్సిపల్ గిరి, యూత్ రెడ్‌క్రాస్ కమిటీ కన్వీనర్ రంజని, సభ్యులు రమాదేవి, స్వాతి, మమత, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికబద్ధంగా కార్యక్రమాలు

నెల్లూరు(పొగతోట): అంగన్‌వాడీ కేంద్రాల్లో మహిళలకు అవగాహన కల్పించేలా పోషణ మాస కార్యక్రమాలను ప్రణాళికబద్ధంగా నిర్వహించాలని సీడీపీఓ అరుణ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. కార్యక్రమాలను బుధవారం నుంచి వచ్చే నెల 16 వరకు సక్రమంగా నిర్వహించేలా అంగన్‌వాడీ కార్యకర్తలు చర్యలు చేపట్టాలని సూచించారు.

వ్యాధుల నివారణకు చిత్తశుద్ధితో పనిచేయండి



మాట్లాడుతున్న హుస్సేనమ్మ

నెల్లూరు(అర్బన్): జిల్లాలో డెంగీ, మలేరియా, చికున్‌గున్యా వ్యాధుల నివారణకు సబ్ సెంటర్ల అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలని జిల్లా మలేరియా నివారణాధికారి హుస్సేనమ్మ పేర్కొన్నారు. జిల్లాలోని ఆరోగ్య సబ్ సెంటర్ల అధికారులతో నగరంలోని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో గల తన చాంబర్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జ్వరాలు పెరుగుతున్న నేపథ్యంలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో రక్త పరీక్షల సంఖ్యను పెంచాలని కోరారు. ఖాళీగా ఉన్న నీటి గుంతలను గుర్తించి వాటిల్లో గంబూసియా చేపలను వదలాలని సూచించారు. ఫ్రైడే.. డ్రైడే కార్యక్రమాలను విస్తృతం చేయాలని పేర్కొన్నారు. మలేరియా నివారణ సహాయాధికారి నాగార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్య భద్రతకు కృషి



నెల్లూరు(అర్బన్): మహిళల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని, ఇందులో భాగంగా అన్ని ప్రభుత్వాస్పత్రుల్లో నిర్వహించనున్న స్క్రీనింగ్ పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర టీబీ జాయింట్ డైరెక్టర్ రమేష్ సూచించారు. నగరంలోని సర్వజన ఆస్పత్రి, అల్లీపురం పీహెచ్‌సీ, అక్కడ ఏర్పాటు చేస్తున్న నారీ శక్తి కేంద్రాలను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బుధవారం నుంచి అక్టోబర్ రెండు వరకు నిర్వహించనున్న స్క్రీనింగ్ పరీక్షల్లో భాగంగా అన్ని ఆస్పత్రుల్లో ప్రత్యేక వైద్యశిబిరాలను ఏర్పాటు చేసి మహిళలకు పలు రకాల పరీక్షలను నిర్వహించనున్నారని వెల్లడించారు. సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ మాధవి, డీఎంహెచ్‌ఓ సుజాత, మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ మస్తాన్ బాషా, ఏఓ కళారాణి, ఏడీ ఏడుకొండలు, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ నివారణాధికారి ఖాదర్‌వలీ, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ సుధీర్‌కుమార్, బ్రహ్మేశ్వరనాయుడు, శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హామీలు ప్రకటనలకే పరిమితం



నెల్లూరు(వీఆర్సీసెంటర్): కూటమి ప్రభుత్వ హామీలు ప్రకటనలకే పరిమితమయ్యాయని సీపీఐ జిల్లా కార్యదర్శి అరిగెల నాగేంద్రసాయి విమర్శించారు. మూలాపేటకు చెందిన నిరుపేద మహిళ బతుకుదెరువు కోసం తోపుడు బండిని సంతపేటలోని పార్టీ జిల్లా కార్యాలయం వద్ద మంగళవారం అందజేశారు. పేద మహిళకు తమ వంతుగా సాయంగా వీటిని అందజేశామని చెప్పారు.

పెన్నా రిటైనింగ్ వాల్ పరిశీలన



నెల్లూరు(వీఆర్సీసెంటర్): భగత్‌సింగ్‌కాలనీ వద్ద గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన రిటైనింగ్ వాల్‌ను స్థానిక సీపీఎం నేతలు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పార్టీ నేత నాగేశ్వరరావు మాట్లాడారు. నిలిచిపోయిన రిటైనింగ్ వాల్ పనులను త్వరితగతిన పూర్తి చేసి భగత్‌సింగ్‌కాలనీ వాసులను కాపాడాలని డిమాండ్ చేశారు.

చెక్క రిక్షాల అందజేత



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): దొంతాలిలో ఇద్దరు చల్లా యానాదులకు చెక్క రిక్షాలను ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి మల్లికార్జునరెడ్డి మంగళవారం అందజేశారు. చెత్తను తరలించేందుకు వీలుగా వీరికి పంపిణీ చేశామని వివరించారు. మిగిలిన పది మంది చల్లా యానాదుల కుటుంబాల చిన్నారులను పాఠశాలల్లో చేర్పించనున్నామని, అనంతరం వీటిని అందజేయనున్నామని పేర్కొన్నారు.

ప్రైవేట్ బస్సులపై చర్యలకు వినతి



డీటీసీకి వినతిపత్రమిస్తున్న నేతలు

నెల్లూరు (టౌన్): ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి ఇష్టారాజ్యంగా నడుపుతున్న ప్రైవేట్ బస్సులపై చర్యలు చేపట్టాలని నెల్లూరు జిల్లా ఆటో కార్మిక సంఘం, ఇందుకూరుపేట మండల ఆటో యూనియన్ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా రవాణా శాఖ కార్యాలయ ఎదుట ధర్నాను మంగళవారం చేపట్టిన అనంతరం డీటీసీ చందర్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆటో కార్మిక సంఘ జిల్లా అధ్యక్షుడు సురేష్, ప్రధాన కార్యదర్శి రాజా, ఇందుకూరుపేట ఆటో యూనియన్ నేత దయాసాగర్ మాట్లాడారు. స్త్రీ శక్తి పథకం అమలుతో ఆటో కార్మికుల జీవనం పూర్తిగా దెబ్బతినిందని, ప్రైవేట్ బస్సులను ఇష్టారాజ్యంగా తిప్పుతుండటంతో తమ పరిస్థితి దిగజారిందని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్దేశించిన సమయాల్లోనే బస్సులు తిరిగేలా చర్యలు చేపట్టాలని కోరారు. యూనియన్ సభ్యులు శీను, వెంకయ్య, కృష్ణయ్య, రామారావు, రాము, లోకేష్, మల్లి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): బీవీనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ అన్నమయ్య ఫీడర్‌లో మరమ్మతులను చేపట్టనున్న క్రమంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా బుధవారం ఉండదని నెల్లూరు టౌన్ ఈఈ శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మినీబైపాస్‌లోని షాపింగ్ కాంప్లెక్స్, అనిల్ గార్డెన్స్ తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు.

పేరుకుపోయిన మురుగు

• చెత్తాచెదారంతో నిండిపోయి..
• దుర్గంధంతో ప్రజల అవస్థ



హరనాథపురంలోని మొదటి వీధిలో ఇదీ పరిస్థితి

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలోని కాలువల్లో సిల్ట్‌ను తొలగించేందుకు భారీగా వెచ్చిస్తున్నా, క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా కనిపిస్తోంది. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని కాలువల్లో మురుగు సజావుగా పారేలా చర్యలు చేపట్టాలని పురపాలక శాఖ మంత్రి నారాయణ, కమిషనర్ నందన్ తరచూ ఆదేశిస్తున్నా, ఆచరణలో అంతంతమాత్రంగానే కనిపిస్తోంది. కాలువల్లో చెత్తాచెదారం నిండిపోయి మురుగు ముందుకు కదలడంలేదు. పూడికను సక్రమంగా తీయకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడుతోంది. దుర్గంధం వెదజల్లుతుండటంతో స్థానికుల అవస్థ తీవ్రమవుతోంది. రంగనాయకులపేట, ఇసుకడొంక, మారుతినగర్, హరనాథపురం తదితర ప్రాంతాల్లో నివసించే ప్రజలు ఇంట్లో వాడే నీటిని సైడ్ కాలువల్లోకి వెళ్లేలా ఏర్పాటు చేశారు. వ్యర్థాలను సైతం కాలువల్లో వేయడంతో మురుగు ముందుకు కదలని పరిస్థితి నెలకొంది. దోమలు విజృంభిస్తుండటంతో ప్రజలు రోగాల బారిన పడాల్సి వస్తోంది.

దోమల నివారణ చర్యలు శూన్యం

దోమల నివారణకు చేపడుతున్న చర్యలు శూన్యమని స్థానికులు ఆరోపిస్తున్నారు. కాలువల్లో పేరుకుపోయిన వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించడంలేదని పేర్కొంటున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మురుగు పారడంలేదు



సైడ్ కాలువలు పూడికతో నిండి మురుగు ముందుకు పారడం లేదు. రోజుల తరబడి అలాగే ఇళ్ల ముందు నిలిచిపోతోంది. దుర్గంధాన్ని భరించలేకపోతున్నాం. ఇళ్లలో ఉండలేకపోతున్నాం. దోమలు విపరీతంగా పెరిగి రోగాల బారిన పడుతున్నాం. కాలువల్లో పూడిక తీసి మురుగు పారేలా చర్యలు చేపట్టాలి.

– అశోక్, నేతాజీనగర్